# చెయ్‌వాసి

"పెద్దో... చిన్నో? దాంతో మనకు పన్లే. వాడు ఎవుడైనా కానీ ఏమన్నా చెప్పనీ. చెప్పింది స్రెద్దగా యినుకోవాల. మల్ల కావాలంటే తీరుబాటుగా తిన్నెమిందనో లేకుండాపోతే ఎన్ను మింద గువ్వ మాదిర్నో నిమ్మతిగా కూసోని ఆలోచించుకోవాల. మణుసు కొచ్చిందా తీసుకోవాల. లేకుండా పోతే మట్టసంగా ఆడికి యిడ్సి పెట్టేయాల. ఈ కొంపలో కత అట్టగాక పాయ్‌నే. ఒకరు చెప్పేదేంది మనం యినేదేంది? అంటా ఎవుడి మటుకు వాడొక పెద్ద మణిసి అయిపోతావుంటే యింకేముండాది? అందురు సగిలిగా ఒక దోవ పట్టుకోని నడస్తా ఉంటేనే సంసారాలు నెగ్గుకోని వచ్చేది ఆడి కాడికే ఉండాది. వలపటెద్దు దోవ వలపటెద్దుదే! దాపటెద్దు దోవ దాపటెద్దుదే! అయినట్టు అట్టొకరు యిట్టొకరు గుంజులాడ్తే ఏమయితింది? తెగిపోతింది. కొంప అల్లాకులు పల్లాకులై పోతింది."

నిద్దర మొకంతో యిల్లు యిడ్సిపెట్నా. ఎన్ని గడపలు ఎక్కిదిగినానో ఆ దేముడికే ఎరిక. పొద్దునడిమిట్ట కొచ్చేదాకా తిరిగేకుందికి ఆవజీవాలు అణిగిపాయ. ఇంక తిరగలేమురా తండ్రీ! అనుకోని కొంపకొస్తి. వస్తే కొంపలో ఆడది ఏం చెయ్యాల?

"అయ్యో పాపం! మొగోడు ఎండనపడి వచ్చినాడే. వాణి మొకాన అన్ని నీళ్లో నిప్పులో కొట్టాల్నే!" అనుకోకుండా మా బాశాలి అప్పావుపిళ్ల అయ్యోరి మాదిర్తో పాటం చెప్పేదానికి మొదులు పెట్టె!...

అప్పావుపిళ్ల అయ్యోరు ఏముండాదిలే పాపం! చెప్తావుండే పాటం యినిపించుకోకుండా అరట్లు కొడ్తావుంటే గోడకుర్సీ ఎయ్‌పిస్తాడు. లేకుండాపోతే తొడబెల్లం పెడ్తాడు. కాదుగీదంటే గుంటకట్ట మిందికి పరిగిత్తా పొయ్యేది. ఆ కట్టమింద మామేనత్త కొక అంగిడుండె. అత్తనడిగి అంత పావ్వాకుకాడ తీసుకుండేది. మల్లా పరిగిత్తా వచ్చేది. ఎవుడి కంట్లో పడకుండా అయ్యోరి చేతిలో పెట్టేసేది. ఆ పావ్వాక్కాడ దవడన చేరేకుందికి ఆయన లోకం ఆయనది. మనలోకం మనదిగా ఉండె.

మా బాశాలి కత అట్టాగాక పాయ్‌నే!

ఆపెకు గానా వొళ్లు రగిలిందంటే యింక కొంపలో గొల్ల సిగమే! చేతిలోవుండే గెరిటే వీరజాటి అయిపోతింది. పొయ్యిమింద కళపళా ఉడకతా ఉండే కుండ ఏ సెణంలో పగిల్తిందో? యాడ పగిల్తిందో? ఎట్ట పగిల్తిందో? దాని తలరాత ఎవుడు చూసె?

అంత పని ఎందుకులే? - రొంత సేపు చెవులు యినపడవు. కండ్లు కనపడవు. అనుకుంటే సరిపోతింది. అని సరిపెట్టుకుందామంటే గొంతు తడారక పోతా ఉండాది.

రోన్ని నీళ్లన్నా ఎత్తి గొంతులో పోసుకుందామని చెంబు కోసరం తారాడ్తా ఉండా. పట్టపాగులే తారాడేదంటే?... యింకేం చెయ్యాల? కరంటు కోత గదా!...

''అప్పటికి కొంపలోనుంచి ఎలబారక ముందర్నే నా ఏడుపేదో నేను ఏడ్సినా. ఇట్టా మాదిరి ఏడుపులన్నీ చెవికెక్కేటట్టుగా ఉంటే ఈ కొంప గెతి యిట్టెందుకుంటింది.''

ఒక పక్క తిరిగిన బల్లికి! యింకొక పక్క దప్పిక. అరికాలి మంట ఉచ్చి కెక్కె!

''ఎలబారక ముందే ఏడ్సినావు గదా? అందుకే పాయ్‌న పని గూడా ఏడ్సుకోని పొయ్యింది.'' అని అందామని నోటిదాకా వచ్చె. అయినా ఆపె చేతిలో ఉండేది చూసి నిలిపేసినా.

''ఏ దేవుడు నా మొరాలకించినాడో? జలమ జల్మాల్లో ఎవురు చేసుకున్న పూజా పలమో? దాని రాత పలమో? ఆ బిడ్డకు లేకలేక ఒక సంబందం కుదిరింది. ఈదినాల్లో ఆడబిడ్డకు సంబందం కుదిరేదంటే మాట్లా? కుదిరేదాకా వొక బాద. కుదిరినాక యింకొక బాద. అమ్మేదానికి పోతే అడివి. కొనేదానికి పోతే కొరివిగా ఉండే దినాల్లో ఆ మూడు ముళ్లు ఎయ్‌పించేదంటే మాట్లా? వొళ్లో చేతులు పెట్టుకోని కూసుంటే రమ్మంటే శాతల్లోకి దుడ్లు ఎట్టొస్తాయి? పోనీ అప్పోసప్పో చేద్దామంటే పుట్రాని గింజన్నా బూమిలో పుడ్తింది గానీ అప్పు పుట్టే కాలమేనా యిది?''

''ఆ సంగతి తెల్సుగదా? తెల్సితెల్సీ తెల్లారే కాడికే నన్నెందుకు ఊరిమిందికి తోలింది? వాడికి అది చేస్తివే. ఇంకొకడికి యిది చేస్తివే. వాణ్ణి అడగరాదా? ఈణ్ణి అడగరాదా? అని ఎగతోల్తివి. అడిగితే ఏమాయ?''

''అందుకే గదంటే పెద్దోళ్లు అడుక్కోని తినేదానికి పాయ్‌నా ఆగీత అనేది సక్కరంగా ఉండాలంటారు!''

''ఇద్దో యిట్టమ్మా! ముడ్డికి కాటిక పెట్నెట్టు మాట్లాడమంటే? ముందు తమరి పేరు చెప్పి మల్లా యింకొకరి పేరు చెప్పాల. అదిగాదే! పోతా ఉండేది అప్పు అడిగేదానికి కదా? ఏయాళ ఎట్లా ఉంటిందో? ఎవురి చెయ్‌వాసి ఎట్లా ఉంటిందో? ఆ బిడ్డ చెయ్‌వాసి మంచిదే. అయిదో పదో ఆ అమ్మి చేతిగుండా తీసుకోని పోయే! – అంటే ''చెయ్‌వాసిలే. గియ్‌వాసిలే!'' అని కొట్టి పారేస్తివి. ఇప్పుడు ఉత్తచేతులు ఊగించుకుంటా తిరుక్కోని వస్తివి.''

మాటకు మాట అంటిస్తా నోరు ముయ్యించే దాంట్లో ఎవురైనా మా బాశాలికి రద్దే. ఒక్కొక్కరి నోటి చలవ. ఈ జల్మానికి నాకిట్లా రాసి పెట్టుండాది. పడ్తా ఉండా. లేకుండా బోతే ఈ కాలంలో గూడా పిల్లి అడ్డంగా వచ్చింది. ముండ మోపి ఎదురయింది. ఒంటి బాపనోడు ఎదురుంగా వచ్చినాడు. కొత్తకుండలు వచ్చినాయి. కట్టెమోపులు వచ్చినాయి. చెయ్‌వాసి. బోణీ! ఏంది యిదంతా? అనుకోని మా బాశాల్ని ఎగటాయించి ఎలబారిపోతే ఏమాయె? ఎవుడి తావుకుపాయ్ నోరు తెర్సినా ఊడిపాయ జారిపాయ అనే పనేనా?

మరీ ఆ కర్నాల వీదిలో ఒక మహన్నబావుడు ఉండాడు. సామీ! అటుమంటోళ్లను

సందేళపూట దీపం ఎలిగించి మరీ మరీ తల్సుకోవాల. నోరు తెరస్తే చాలు. ''ఏడు కేజీల ఎండి మూడు కేజీల బంగారు... యాభై లచ్చల్తో వడ్డీ యాపరం! సవాల్! ఈ జిల్లాలో ఎవుడైనా ఉండాడా?'' అంటా మీసం వడేస్తాడు– మూతిమింద మీసం లేకుండా పాయ్‌నా.

అదే మనం అడిగితే మటుకు–

''అయ్యయ్యో! నువ్వు యిట్టా వస్తా ఉండావ్. వాళ్లు అట్టా పోతా ఉండారు. పెమాణకంగా అయిదంటే అయిదేనిమిశాలు గూడా కాలా. ఆ రెడ్డికి సిల్మాటాకీస్ మింద... ఈ నాయుడికి కోళ్ల పారం మింద గాందీరోడ్లో గుప్తావాళ్లు ఉండ్లా. వాళ్లకు గుడ్డల అంగిడి మింద. ఉణ్ణిందంతా ఊడ్సినట్టు ఎత్తి యిచ్చేసినా. ఒక్క గెంట ముందుగా వచ్చుంటేనా?'' అని వగస్తాడు.

మల్లా–

''మనకు ఏం కావాలన్నా? కావాల్సింది వడ్డీ. అది సక్కరంగా యిస్తే చాలుగదా? ఎవుడైతే మనకు ఏముండాది. కాదు గీదంటే కోర్టు ఉండనే ఉండాది. అరెస్ట్ వారెంట్ అంటే నిమిశాల్లో రాలిపోతింది.'' అంటా ముక్తాయింపు పలకతాడు.

ఇది రెడీమేడ్ పాట. నువ్వు ఎప్పుడన్నా అడుగు. ఎంతన్నా అడుగు. ఇదేపాట పాడేస్తాడు.

''అయితే గూడా సుబకార్నెం గదా? వాడికీ బిడ్డా పాప ఉండారుగదా? అంతో యింతో ఆదుకోకుండా పోతాడా?'' అనుకోని పాయ్ అడిగితే అప్పుడు గూడా యిదే పాటేనా?

''సరే! మనం వాడికి ఏమీ చెయ్‌లా. వాడు మాత్రం మనకెందుకు చెయ్యాల.?'' అని సమాదాన పర్సుకోని యింకొకడి దగ్గరికి పోతి. ఆ యదవ ఎట్టాటోడంటే?–

''ఊళ్లో ఉండేదంతా పందికి చాలదు. పందిని అడిగే వాడెవుడు పాపాత్తుడు.'' అంటారు. ఆ పాపాత్తుణ్ణి నేనే అనుకుంటా వాడి దగ్గిరికి పోతి. ఎందుకంటే?–

ఎన్నోమాట్లు వాడు గొంతుమిందికి వచ్చిందంటే నా సెగితి కాడికి ఆదుకోనుండా. సాయానా నా బిడ్డ పెండ్లి అంటే యినిపించు కోకుండా పోతాడా? అనుకుంటే ఆ గొడ్డుబోతు యదవకు యాడ యినిపిస్తింది?

''నీ ఎనకాలే వస్తావుండా పద!'' అని ఒక సారి అంటాడు.

''నువ్వు ముందుగా పద. నీకంటే ముందుగా నీ యింటి కాడ ఉంటా'' అని యింకొకసారి అంటాడు. అంతా ఏడ్సేబిడ్డకు ఎలక్కాయ చూపించి యామారించే యవారం!

ఇట్టా మాదిర ఎంతమంది చుట్టూ తిరిగినానో మా బాశాలికి ఏం తెల్సు? ఆపెకు తెలిసిందంతా–

''వాడు కష్టమంటే వాడి ఎంట పడ్తివి. ఈడు కష్టమంటే ఈడి ఎంటపోతివి. ఇప్పుడు నీకు కష్టమంటే ఏయవదన్నర యదవన్నా నీ ఎంట వస్తా ఉండాడా?'' అని నీలదీస్తింది.

నిజిమే గదా? చేసిందంతా గ్యాపకం పెట్టుకుండేటట్టుగా ఉంటే ఈ లోకం యిట్టా ఎందుకు ఉంటింది?

''ఈ ఆడపుట్టక పుట్టే దానికంటే అడివిలో చెట్టయి పుట్టేది మేలు. ఒకేళ కర్మగాలి పుట్నా యిద్దో యిట్టాంటి మొగోణ్ణి కట్టుకోని ఏగులాడేదుండాదే రామ! రామ! పగోళ్లకు కూడా వద్దురా సామీ!''

మా బాశాలి వగస్తా ఉండాది.

మాయబ్బతో చెప్తా ఉండా. ఆ మాటలు చెవల్లో పడేకుందికి దప్పికి ఎట్టపాయనో పాయ. ఆకిలి ఎట్టపాయనో పాయ. కాళ్ల తీపులు తీస్తా ఉండె. ఉరువు చెప్పకుండా పాయ. ఇంక నోరు తెరెస్తే దుడ్లిచ్చి తద్దినం కొనుకుణ్ణట్టే అవితింది. ఎండని కూడా పాలుమారలా. ఇంట్లో పోరు తప్పించుకుంటే చాలని ఎలబార్తి.

మట్ట మద్దేణం కాడ ఎండ. మాడు పగలగొట్టా ఉండాది. మణుసా? ఎట్టెట్నో పోతా ఉండాది.

వొగిసినట్టే వాడి ఆలితాడు తెంచేదంటే యిట్నేనేమో. వగస్తా వగస్తానే మాబాశాలి ఎంత మాట అనె. ఆపె నాతో ఏగులాడ్తా ఉండాదంట. ఆ ఏగులాట పగోళ్లకు కూడా వద్దంట. యాడబ్బా నేను దాని దుంపదెంచి గంపకు ఎత్తతా ఉండేది? అయినా ఈ ఆడోళ్లు ఉండారే?– మాట అనేదానికేమో లేసుగా అనేస్తారు. మల్లా మాటట్టా పైనపడనీరు. పడ్తే పట్టి పీకతారు. లేకుండా బోతే పలపల కురిపించేస్తారు!

అయినా యాడుంటాయో ఏం పాడో అన్ని నీళ్లు!

ఇంతకూ ఆమె అంత బాద ఎలబోసింది ఎందుకని? తెల్లార్తో నేను అప్పుకోసరం ఎలబార్తా చెయ్‌వాసి మంచిది కాబట్టి మాబిడ్డ దగ్గిర బోణీ చెయ్‌పించుకొనుంటే కర్నాలీదిలో ఆ మహన్నబావుడు మూడుకేజీల బంగారు ఏడుకేజీల ఎండీ అట్నే మూటగట్టి యిచ్చేసి ఉంటాడా? లేకుండాపోతే అడుక్కు అర్వై అపద్దాలు చెప్పే ఆ యదవ అడిగీ అడగకముందే ఎత్తిచ్చేసి ఉంటాడా? నోరు ఉండాదని నోటికొచ్చినట్టు మాట్లాడ్తే ఎట్టబ్బా? అని ఆలోచించుకుంటా పోతావుంటే మణుసు మా ఊరికల్లా మల్లె!

మిద్దూరికి ఉత్తరంగా నాయన చెరువు ఉండాది. ఆ చెరువును ఆనుకోని గూటంకొండ ఉండాది. అద్దో ఆ కొండ కిందనే నాలుగిండ్లు. ఆ నాలుగిండ్లూ ఒక కుటుంబరానికి చేర్నివే. దున్నపోతై పుట్టే దున్ని చావాల. అన్నాదమ్ములై పుట్టే ఏర్లు పోవాల. అంటారు. అది ఆ యింట్లో చలామణీగాలా. ఆ నాలుగిండ్లు తాతిరెడ్డి గారి ఊరని గ్రామ లెక్కల్లోకి ఎక్కినా అందురు దాన్ని 'కొండకింద' అనే అంటారు. ఈ పాయికట్లో చిన్న పిలగాణ్ణి అడిగినా 'కొండకిందంటే' చిన్న పిలకాయిలకు దండలు ఏసేది ఆణ్ణే గదా? అంటాడు.

ఆదివారం తెల్లార్తో ఆడికిపొయ్ చూస్తే–

''పిలగాడికి వారందినాలుగా పట్టిన జరం యిడవనే లేదమ్మా!'' అని ఒకరు–

''సందులమ్మా!'' అని యింకొకరు-

బిడ్డల్ని సంకలో ఏసుకోని యిట్టా రకరకాలుగా చెప్పుకుంటా ఒక గుంపుడు మంది ఆడోళ్ల సాలుపుగా నిలబడుకోని ఉంటారు.

ఆ యింట్లో క్రాయనో... సినాయిలో... ఇరగమరెడ్డో ఎవురికి ఎసులుబాటుగా వుంటే వాళ్లు వస్తారు. ఆ యిండ్ల ముందర ఒక రాగిచెట్టు యాపచెట్టు పెనేసుకోని ఉండాయి. ఆ చెట్టుకింద అట్టాబారడు యిట్టాబారడు చెత్తచెదారం ఊడ్సి సుద్దం చేస్తారు. ముంతడు నీళ్లతో కళ్లాపు చల్తారు. ఆ కయ్యల్లో అంత మట్టి ఎత్తుకోనొచ్చి నీళ్లు పోసి బాగా మైణం మాదిర పిసకతారు. ఆ మట్టితోనే ఒకొగిటి ఒక పిడికిడంత మూడు పిల్లార్లు చేస్తారు. ఆ పిల్లార్లకు పాసుపు కుంకం పెడ్తారు. వాటి ముందర అడ్డదిడ్డంగా ఒక ముక్కుర యేస్తారు. సాంబ్రాణి పుల్లలు ఎలిగిస్తారు. ఆమిందట ఒకరొకర్ని రమ్మంటారు.

వచ్చేదాంట్లో మాత్రం ముందొచ్చినోళ్లు ముందే. ఎనకొచ్చినోళ్లు ఎనకే! -

వాళ్లు తెచ్చిన కర్పూరం ఎలిగిస్తారు. వాళ్లు తెచ్చిన టెంకాయి కొడ్తారు. వాళ్లు తెచ్చిచ్చిన యాపమండతోనే ఆంజినేయుడి దండకం సగం మింగతా సగం బయిటికి చెప్తా మంత్రిస్తారు. వాళ్లు తెచ్చిన కోడి పిల్లనే రొండు కాళ్లు పట్టుకోని మూడుసార్లు యిట్టా మూడుసార్లు అట్టా దిగతీసి యిసిరట్టా పారేస్తారు. ఆ మద్దేణాలకు అది ఆయింటి కోడిపిల్లల్లో పిల్లగా చేరి పోతింది. వాళ్లేమో చిటికినవేలి నూలు దారానికి పాసుపు కుంకం పట్టించి సాంబ్రాణి పొగేసి మెళ్లో కట్టేస్తారు.

ఆ దండ ఎయ్‌పించుకునే కుందికి వాళ్ల గుండికాయి గూటం కొండంత అవితింది.

ఎవురు చెప్పినా ఆ దండకమే. ఎవురు కట్నా ఆ నూలుదారమే. ఎవురు పూజ చేసినా ఆ మట్టి ముద్దలకే. అయితే గూడా క్రాయన చెయ్‌వాసి మంచిదంట. క్రాయన లేకుండా పొయ్యేకుందికి మాయమ్మ నాకు దండ ఎయ్‌పించకుండా తిరుక్కోని వచ్చేసింది.

ఇది ఎప్పుటి మాట? మనకి సొతంత్రం రాకముందుటి మాట. అప్పుడు మాయమ్మ. ఇప్పుడు మా బాశాలి. ఏమన్నా మార్నారా? లేదే? ఏండ్లు పూండ్లు గడ్సి పాయ. కాలం ఎంతో మారి పాయ. వాళ్ల నడవడి మార్లేదే? అని ఆలోచించుకుంటా ఆ నాలుగాళ్లమండపం కాడ నిలబడుకోని ఉంటే ముత్తారెడ్డన్న వచ్చె.

''ఒరే అబ్బోడా! మనకు సొతంత్రం వచ్చి ఎన్నేండ్లయింది? నలబై ఏండ్లకు పైబడిందా? ఇంకా చెయ్‌వాసి అంటే ఎరక్కపోతే నువ్వొక ఎర్రోడే గదరా? మన చెయ్‌వాసి అంటే ఏమనుకున్నావ్? నలబై ఏండ్లుగా మనం ఓట్లు యేస్తానే ఉండాం. మన చెయ్‌వాసి మంచిది గాబట్టి మనం ఓట్లు యేసిన వాళ్లంతా గెలస్తానే ఉండారు. గెల్సినోళ్లంతా పెద్దోళ్లయి పోతానే ఉండారు. చెయ్‌వాసంటే ఏమనుకున్నావ్?'' అనె.

''ఈ చెయ్‌వాసి యిట్నే ఉండాలని ఎవురెవురు ఎన్నెన్ని దేముళ్లకు మొక్కతా ఉండారో ఆ దేముళ్లకే ఎరిక. మనకు ఎరికయ్యేటట్టుగా ఉంటే మనం ఎందుకిట్టా ఉంటాంలే?'' అనుకుంటి.●